క్లుప్తంగా

పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ కార్యవర్గం



అసోసియేట్ అధ్యక్ష కార్యదర్శులు సువర్ణరాజు, పద్మనాభం

మలికిపురం: పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అసోసియేట్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా కోరుకొండ సువర్ణరాజు, కార్యదర్శిగా యేసుగంటి వెంకట పద్మనాభం ఎన్నికయ్యారు. మలికిపురంలో జరిగిన సమావేశంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్, కార్యదర్శి మంగం అమృతరావు, రాష్ట్ర కార్యదర్శులు కంకటాల చంద్రశేఖర్, పంగం బ్రహ్మాజీరావు తదితరులు పాల్గొని అభినందించారు.

ప్రశాంతంగా ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు

అంబాజీపేట: స్థానిక ఎస్ఎస్ఎం కళాశాలలో బుధవారం నిర్వహించిన ఫస్ట్ ఇయర్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్ట్ ఇయర్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెకండ్ ఇయర్ పరీక్షలు జరిగాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాధామణి, చీఫ్ సూపరింటెండెంట్ ఎస్ఎస్ రావు తెలిపారు. ఫస్ట్ ఇయర్ 30కి 26 మంది, సెకండ్ ఇయర్ 69 మందికి 60 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

నీతి అయోగ్ సభ్యుడితో ఎమ్మెల్యే భేటీ



సారస్వత్‌ను కలసిన ఎమ్మెల్యే దేవ

మలికిపురం: నీతి అయోగ్ సభ్యుడు వీకే సారస్వత్‌తో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ భేటీ అయ్యారు. అంతర్వేది పర్యటనకు వచ్చి దిండిలో బస చేసిన ఆయనను ఎమ్మెల్యే కలసి పుష్పగుచ్ఛం అందించారు. అలాగే బోనం రాజు పలువురు ప్రముఖులు కూడా సారస్వత్‌ను కలసిన వారిలో ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

మలికిపురం: ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయం సాధించాలని మంత్రి కె.అచ్చెన్నాయుడు కూటమి శ్రేణులకు సూచించారు. మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. పట్టభద్రులంతా కూటమి వైపే ఉన్నారని ఓట్లు వేయించుకోవడమే తరువాయి అని అన్నారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి శ్రమించాలని సూచించారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దాగుడు మూతల దండా'కోడ్'



అంబాజీపేట ఎంపీడీఓ కార్యాలయం వద్ద చంద్రబాబు ఫొటోతో కనిపిస్తున్న పోస్టర్

అంబాజీపేట: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో అధికారులు దాగుడుమూతలాడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికార పార్టీ రాజకీయ నాయకుల ఫొటోలతో ఉన్న పోస్టర్లను తొలగించలేదు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర పేరిట పోస్టర్‌తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోలతో దర్శనమిస్తున్నాయి. అలాగే గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల వద్ద అధికార పార్టీ ముఖ్యనేతల ఫొటోలకు ముసుగు వేయడంలో పంచాయతీ అధికారులు అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.

కంద్రిక పేట పాఠశాల విలీనం నిలిపి వేయాలి

ఆలమూరు: స్థానిక కంద్రిపేట ప్రాథమిక పాఠశాలను విలీనం చేయాలన్న ప్రతిపాదనను మండల విద్యాశాఖ విరమించుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ ఎస్‌వీ సుబ్బరాజుకు బుధవారం అందజేశారు. స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఈ పాఠశాలలో 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరూ స్థానిక యానాదులపేట, పరిసర ప్రాంతాల్లోని ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలు కూడా ఈ పాఠశాలలోనే చదువుతున్నారన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉన్న కంద్రికపేట రామాలయం వద్ద ఉన్న పాఠశాలను విలీనం చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలని కోరారు.


నిలిచిన వ్యాక్సిన్ సరఫరా

- నిండుకున్న పెంటావాలెంట్ టీకా నిల్వలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- జనవరి నుంచి డోసులు పెండింగ్

మామిడికుదురు: వ్యాధి నిరోధక శక్తిని పెంచి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించేందుకు ప్రభుత్వం ఉచితంగా శిశువులకు అందించే పెంటావాలెంట్ టీకా నిల్వలు గత నెల నుంచి నిండుకున్నాయి. దీంతో పేరెంట్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యాక్సిన్ బయట కొనాలంటే రూ.4 వేలు నుంచి రూ.5 వేలు చెబుతున్నారంటూ పేరెంట్స్ వాపోతున్నారు. ప్రతి బుధ, శనివారాల్లో చిన్నారులకు అందించే ఈ టీకా కోసం పేరెంట్స్ తమ పిల్లలను వ్యాక్సిన్ కేంద్రాలకు తీసుకువచ్చి అక్కడ టీకా అందుబాటులో లేకపోవడంతో డీలా పడి నిరాశతో వెనుదిరుగుతున్నారు. శిశు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పుట్టిన శిశువుతో పాటు ఇదేళ్ల చిన్నారి వరకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. నెలన్నర, రెండున్నర, మూడున్నర నెలల చొప్పున వేసి డీపీటీ, హెపటైటిస్–బీ, హిబ్ అనే మూడు రకాల టీకాలకు ప్రత్యామ్నాయంగా పెంటావాలెంట్ వ్యాక్సిన్ అందుబాటులోకి ఈ వ్యాక్సిన్ ప్రస్తుతం ఎక్కడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది.

21 పీహెచ్‌సీల్లోనూ ఇదే పరిస్థితి...

పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల పరిధిలో 21 పీహెచ్‌సీలు ఉన్నాయి. అయినవిల్లి, వీరవల్లిపాలెం, అంబాజీపేట, ముక్కామల, నగరం, లూటుకుర్రు, తాటిపాక, లక్కవరం, కేశనపల్లి, మోరి, సఖినేటిపల్లి, రామేశ్వరం, నాగుల్లంక, వానపల్లి, అవిడి, ర్యాలి, ఆత్రేయపురం, చొప్పెల్ల, పెదపళ్ల, ఊబలంక, గోపాలపురం పీహెచ్‌సీల్లో పెంటావాలెంట్ వ్యాక్సిన్ అందుబాటులో లేదు. ఒక్కో పీహెచ్‌సీ పరిధిలో రెండు నెలలకు కలిపి సుమారు 100 నుంచి 120 డోసులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. పుట్టిన తరువాత 45 రోజుల నుంచి ప్రతి 28 రోజులకు మూడు విడతల్లో పెంటావాలెంట్ డోసులు వేయాల్సి ఉంది. కానీ వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడంతో సమయం మించిపోతుందని తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు.



చిన్నారులకు వేసే పెంటావాలెంట్ వ్యాక్సిన్

గత నెలలో వేయాల్సి ఉంది



మా బాబుకి జనవరి నెలలో రెండో డోసు వేయాల్సి ఉంది. అప్పటి నుంచి వ్యాక్సిన్ వస్తుందని చెబుతున్నారు. కానీ అది మాత్రం అందుబాటులో లేదు. సమీపంలో ప్రతి పీహెచ్‌సీలోనూ వ్యాక్సిన్ కోసం అడుగుతున్నాం. కానీ ఎక్కడా అందుబాటులో లేదు. డోసు వేయాల్సిన సమయం మించి పోతుంది. బయట మార్కెట్లో భారీ ధర చెబుతున్నారు. అంత పరిస్థితి మాకు లేదు. తక్షణం వ్యాక్సిన్ అందుబాటులోకి తీసుకురావాలి.

– కొక్కిరి నిరీష, మామిడికుదురు

వ్యాక్సిన్ త్వరగా వేయాలి



మా మనవడికి రెండు వారాల క్రితం రెండో డోసు వ్యాక్సిన్ వేయాల్సి ఉంది. కానీ వ్యాక్సిన్ రాలేదని చెబుతున్నారు. సమయం మించిపోతుందన్న భయం వెన్నాడుతోంది. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదని చెబుతున్నారు. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి పెంటావాలెంట్ వ్యాక్సిన్ అందుబాటులోకి తీసుకురావాలి. ఆ దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది. శిశువులకు సంబంధించిన దీనిపై శ్రద్ధ చూపాలని కోరుతున్నాం.

– రావుల పురుషోత్తం, మొగలికుదురు

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి స్వర్ణలత

మామిడికుదురు: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.స్వర్ణలత సూచించారు. మామిడికుదురు బాలుర వసతి గృహం విద్యార్థులకు బుధవారం ఉచిత ఆరోగ్య పరీక్షలు చేశారు. హాస్టల్‌కు చెందిన 65 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. పౌష్టికాహారం తీసుకుంటూ శ్రద్ధగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కె.సత్యవతి, ఎంపీహెచ్ఎస్ బీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఎంపీహెచ్ఏ కేవీ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ ఒ.రోషిణి, ఏఎన్ఎం కె.దుర్గాదేవి, ఆశ కార్యకర్తలు కె.లక్ష్మీకుమారి, బి.మాధురి పాల్గొన్నారు.

ఉపాధి హామీలో కొబ్బరి చెట్లకు పళ్లాల ఏర్పాటు



ఉపాధి హామీలో చెట్లకు పళ్లాలు ఏర్పాటు చేస్తున్న కూలీలు

మామిడికుదురు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అప్పనపల్లిలో కొబ్బరిచెట్ల చుట్టూ పళ్లాలు ఏర్పాటు చేస్తున్నారు. రైతుల దరఖాస్తు మేరకు ప్రతి రోజు 40 మంది కూలీలు ఈ పనుల్లో పాల్గొంటున్నారు. ఎనిమిది మంది రైతులు పళ్లాల ఏర్పాటు కోరుతూ దరఖాస్తు చేసుకున్నారని ఫీల్డ్ అసిస్టెంట్ నాగబాబు తెలిపారు. సుమారు 25 ఎకరాల్లో కొబ్బరి తోటలకు పళ్లాలు ఏర్పాటు చేసే పనుల్లో కూలీలు పాల్గొంటున్నారని చెప్పారు. గ్రామంలో మొత్తం 90 మంది ఉపాధి కూలీలు ఉన్నారని అన్నారు. వారిలో పలువురు 100 రోజుల పనిదినాలను పూర్తి చేసుకున్నారన్నారు. మిగిలిన వారు ప్రస్తుతం పనుల్లో పాల్గొంటున్నారని చెప్పారు.

కొత్తపేట వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే..

కొత్తపేట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. యువజన విభాగానికి నడింపల్లి సుబ్బరాజు, మహిళా విభాగానికి చల్లా వెంకటపద్మజామణి, రైతు విభాగానికి పెదపూడి బాపిరాజు, బీసీ సెల్‌కు బొక్కా ప్రసాద్, ఎస్సీ సెల్‌కు కప్పల నాగేశ్వరరావు, ఎస్టీ సెల్‌కు కంపసత్తి పట్టాభి, మైనార్టీ సెల్‌కు షేక్ ఖాజాబాబు, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు ఉండ్రాజపు సుందరంవిజయం, స్టూడెంట్ విభాగానికి గొల్లపల్లి రాజశేఖర్, పంచాయతీరాజ్ విభాగానికి పాలా నాగేశ్వరరావు, ఆర్టీఐ విభాగానికి చీకరమిల్లి చిన్న, వలంటీర్ విభాగానికి మార్గన రాము, గ్రీవెన్స్ సెల్‌కు నాయుడు నాగేంద్రప్రసాద్, వాణిజ్య విభాగానికి కోరుప్రోలు వెంకటేశ్వరరావు, వీవర్స్ విభాగానికి వాస వెంకన్న, వైఎస్ఆర్‌టీయూసీకి అల్లుగోజు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ విభాగానికి గొలుగుల వాణి, లీగల్ సెల్‌కు పెద్దింటి వేణుగోపాల్, కల్చరల్ విభాగానికి పితాని రాంబాబు, సోషల్ మీడియా విభాగానికి నెల్లి రాజు, ఐటీ విభాగానికి కొవ్వూరి సుధాకరరెడ్డి, దివ్యాంగుల విభాగానికి కుసుమే సత్యనారాయణ, డాక్టర్స్ విభాగానికి చింతం సత్యనారాయణ ఆనందదాసు, పబ్లిసిటీ విభాగానికి ఇసుకపట్ల సునీల్, ఇంటలెక్చువల్ ఫోరానికి బట్నవిల్లి నాగరాజు, బూత్ కమిటీలకు నామాల శ్రీనివాస్‌లను నియమించారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



కొత్తపేటలో విద్యార్థినులకు బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తపేట: స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు, అధ్యాపకులకు ఉచితంగా రక్తపోటు, మధుమేహం పరీక్షలు నిర్వహించారు. ప్రపంచ క్యాన్సర్ వారోత్సవాల సందర్భంగా స్థానిక డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, జువాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జపాన్ ఆర్గనైజేషన్ స్టేండ్స్ ఫర్ సుమిటోమో మిట్‌సై ఫైనాన్షియల్ గ్రూప్ (ఎస్ఎంఎఫ్‌జీ) రావులపాలెం బ్రాంచ్ సౌజన్యంతో విద్యార్థినులకు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి సుమారు వంద మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేపీ రాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ టీసీహెచ్ పాపారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం బాటిళ్లు కలిగి ఉన్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ దాడుల్లో భాగంగా మంగళవారం మండలంలోని వానపల్లి గ్రామానికి చెందిన పల్లి విజయకుమార్ వద్ద ఎనిమిది 180 ఎంఎల్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

నిల్వ మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు

ఆలమూరు: మండలంలోని ఎక్కడైనా వ్యాపారులు నిల్వ మాంసాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ఎ.రాజు హెచ్చరించారు. మండలంలోని చొప్పెల్లలో బుధవారం నిల్వ ఉన్న మేక మాంసాన్ని విక్రయిస్తూ గ్రామ కార్యదర్శి ఎం.వెంకటరెడ్డికి పట్టుబడ్డటంతో ఈమేరకు ఎంపీడీఓ రాజు స్పందించారు. నిల్వ మాంసాన్ని సుదూర ప్రాంతానికి తీసుకువెళ్లి మంటల్లో కాల్చివేసిన పంచాయతీ సిబ్బందిని ఆయన అభినందించారు.

టీడీపీ కన్వీనర్‌ను తొలగించాలని అచ్చెన్నకు వినతి

పి.గన్నవరం: నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ నామన రాంబాబును ఆ పదవి నుంచి తొలగించాలని కోరుతూ ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు, కార్యకర్తలు బుధవారం పి.గన్నవరానికి విచ్చేసిన మంత్రి అచ్చెన్నాయుడికి వినతిపత్రం సమర్పించారు. నామన ప్రతి గ్రామంలోనూ కార్యకర్తలను గ్రూపులుగా విభజించి, ఆయనకు నచ్చిన వారిని మాత్రమే పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానిస్తున్నారని ఆరోపించారు. కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలను గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. కన్వీనర్‌గా స్థానికుడైన కొత్త వ్యక్తిని నియమించాలని వారు కోరారు. నామనపై మంత్రికి ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ నాయకులు పడాల సూపర్, ఎస్.శ్రీనివాసరావు, పీవీవీ సత్యనారాయణ, కె.నాగబాబు, చిట్టూరి శ్రీనివాస్, ఆశీర్వాదం, ఎం.సుబ్బారావు తదితరులు ఉన్నారు.

పలువురికి జెడ్పీ చైర్మన్ పరామర్శ



మాగంలో కాశీ విశ్వనాథం మాతృమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి

అయినవిల్లి: నేదునూరులో ఇటీవల మృతి చెందిన కామన రామమోహన్ కుటుంబ సభ్యులను, మాతృవియోగంతో బాధపడుతున్న మాజీ పీఏసీఎస్ చైర్మన్ కాశీవిశ్వనాథం, యడ్ల గంగాధర్ కుటుంబ సభ్యులను మాగంలోని ఆయా స్వగృహాల్లో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు బుధవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

రాజశేఖర్‌ను ఎమ్మెల్సీగా గెలిపించాలి

అయినవిల్లి: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రులు నియోజకవర్గ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను ఎమ్మెల్సీగా గెలిపించడంలో దళితులు క్రియాశీలకంగా వ్యవహరించాలని జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు అన్నారు. జిల్లా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఆయన అయినవిల్లి విఘ్నేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఎస్.ఎన్.వి.ఆర్.ప్రభుత్వ కళాశాలలోనూ, జెడ్పీ ఉన్నత పాఠశాలలోనూ ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు.

తెలుగు తేజం పురస్కారం



తెలుగు తేజం పురస్కారం స్వీకరిస్తున్న వెంకటేశ్వరరావు

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారం గ్రామానికి చెందిన తోట వెంకటేశ్వరరావుకు తెలుగు తేజం జాతీయ ప్రతిభా పురస్కారం దక్కింది. సత్యమేవ జయతే అసోసియేషన్ స్థాపనతో పాటు ఆ సంస్థ ద్వారా సమాజంలోని వివిధ వర్గాల ప్రజలకు ఆయన చేసిన సేవలకు గుర్తింపుకు గాను ఈ పురస్కారానికి ఎంపికైనట్లు గోదావరి ఉత్సవ నిర్వాహకుడు అద్దంకి రాజాయోనా తెలిపారు. రాజమహేంద్రవరంలోని గోదావరి ఉత్సవ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ గజల్ కళాకారుడు గజల్ శ్రీనివాస్, శాసన మండలి సభ్యులు బి.గోపిమూర్తి, శ్రీశ్రీ కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్, రాజా చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని వెంకటేశ్వరరావు అందుకున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కొత్తపేట: భగవాన్ సత్యసాయిబాబా చూపిన సేవా మార్గాన్ని అనుసరించి కొత్తపేట సత్యసాయి సేవా సమితి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఇతర సేవా సంస్థలకు ఆదర్శనీయమని జిల్లా సత్యసాయి సేవా సంస్థల అడ్వయిజర్ మన్యం పర్వతవర్ధనరావు, స్థానిక ప్రముఖ వైద్యుడు సత్యవరపు విశ్వనాథగాంధీ అన్నారు. స్థానిక సత్యసాయి మందిరంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, ఐ డ్రాప్స్ పంపిణీ చేశారు. ఆరుగురిని ఆపరేషన్ నిమిత్తం వేమగిరి నేత్రాలయానికి తీసుకువెళ్లారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ముక్కామలలో పోషకాహారంపై వివరిస్తున్న సూపర్‌వైజర్ మహాలక్ష్మి

అంబాజీపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రతి రోజూ చిన్నారులకు క్రమం తప్పకుండా తినిపిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.మహాలక్ష్మి, వెరినమ్మ అన్నారు. ముక్కామల, చిరతపూడి కొంబత్తులవారిపేటలో పూర్వ బాల్యదశ సంరక్షణ, విద్య (ఈసీసీఈ) డేను బుధవారం నిర్వహించారు. వీరు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసిన ఆహారాలను, గుడ్లను చిన్నారులకు అందించే బాధ్యత తల్లితండ్రులదేనన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల చిన్నారుల్లో ఎదుగుదల ఉంటుందన్నారు. అనంతరం చిన్నారులకు బరువు, ఎత్తులను పరీక్షించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

గోగన్నమఠంలో..

మామిడికుదురు: రోజులకు ఎనిమిది పర్యాయాలు చిన్నారులకు ఆహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బి.అన్నపూర్ణ, ఎన్.సుబ్బలక్ష్మి, పి.వి జయలత సూచించారు. గోగన్నమఠం గ్రామ పరిధిలోని ముత్యాలపాలెం, పాశర్లపూడిలంక బొరుసు వారి వీధి, పెదపట్నం అంగన్‌వాడీ కేంద్రాల వద్ద బుధవారం పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమం బుధవారం జరిగింది. దీనిలో వారు మాట్లాడుతూ వయసుకు తగిన విధంగా బరువు, ఎత్తు ఉండేలా తల్లులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు భారతి, ఎన్.నాగలక్ష్మి, కొండాలమ్మ, రత్నమాల, పద్మజ, తల్లులు పాల్గొన్నారు.

అవిడిలో..

కొత్తపేట: ప్రాథమిక స్థాయి బాలబాలికలు ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధిస్తారని స్థానిక ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.చంద్రకళ అన్నారు. కిషోరి వికాసంలో భాగంగా బుధవారం మండలంలోని అవిడి చప్పిడివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోషణ సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ ఆధ్వర్యంలో పాఠశాల హెచ్‌ఎం అరుణశ్రీ అధ్యక్షతన జరిగిన సదస్సులో వ్యక్తిగత పరిశుభ్రత, సంపూర్ణ ఆహారం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: కిశోరి వికాసంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరు, సంధిపూడి గ్రామాల్లో కిశోరి వికాసం అనే అంశంపై హైస్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. రక్త హీనత, మహిళా అక్రమరవాణా, లింగ వివక్షత, బాల్య వివాహాల నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

ముద్రగడపై దాడి అమానుషం



గన్నవరపు శ్రీనివాసరావు

అయినవిల్లి: మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇంటిపై జరిగిన దాడి అమానుష చర్య అని, చాలా బాధాకరం విషయమని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన అయినవిల్లిలోని ఆయన స్వగృహంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ పాలన సాగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను తుంగలో తొక్కారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుల ఇళ్లపైకి వెళ్లి దాడులు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ముద్రగడ పద్మనాభం ఇంటిపై దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

యాత్రాదర్శిని త్రిభాషా పుస్తకావిష్కరణ



అంతర్వేది ఆలయంలో యాత్ర దర్శిని త్రిభాషా పుస్తకావిష్కరణలో ప్రముఖులు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో తొలిసారి తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో ప్రచురించిన అంతర్వేది యాత్ర దర్శిని పుస్తకాన్ని బుధవారం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆవిష్కరించారు. టెంపుల్ టూరిజం సిరీస్–1 పేరుతో వైభవ్ పబ్లిషర్స్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. పుస్తక రచయిత కేఎంకే రమేష్ మాట్లాడుతూ, భారతీయ దేవాలయాల చారిత్రక, పౌరాణిక ప్రాముఖ్యతలను ప్రపంచానికి చాటి చెప్పాలనే లక్ష్యంతో వీ ఫౌండేషన్ ద్వారా వైభవ్ పబ్లిషర్స్ ఈ బృహత్తర కార్యానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఏసీ సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రాంతీయ భాషతో పాటు, జాతీయ, అంతర్జాతీయ భాషల్లో అంతర్వేది క్షేత్ర విశేషాలను పొందుపరుస్తూ పుస్తక రూపంలో ప్రచురించడం అభినందనీయమన్నారు. హిందీ అనువాదకుడు డాక్టర్ చిట్టిల్ల నిర్మలాదేవి, ఆంగ్ల అనువాదకుడు డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి, ఆర్ట్ ఫొటోగ్రాఫర్ వి.శర్మ, ప్రధానార్చకుడు కిరణ్, సూపరింటెండెంట్ సారథి పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ సిస్టం పరిశీలన



అంతర్వేది టూరిజం గెస్ట్‌హౌస్‌లో కమాండ్ కంట్రోల్ సిస్టంను పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో లక్ష్మీనరసింహ స్వామివారి తిరు కల్యాణ మహోత్సవాల్లో భక్తుల భద్రతకు నిర్దేశించిన సీసీ కెమెరాల వ్యవస్థను నడిపే కమాండ్ కంట్రోల్ సిస్టంను అమలాపురం ఆర్డీవో కె.మాధవి బుధవారం పరిశీలించారు. అంతర్వేది టూరిజం గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన ఈ సిస్టం ద్వారా తీర్థంలో ఆయా రద్దీ ప్రాంతాలలో పరిస్థితులు ఎప్పటికప్పుడు అంచనా వేసే విధానం, మైక్ అనౌన్స్‌మెంట్ విధానాలను ఆమె క్షుణ్ణంగా టెక్నీషియన్లతో చర్చించారు. తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ పాల్గొన్నారు.

డీడీవోగా తహసీల్దారే ఉండాలి



అంబాజీపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోలు

అంబాజీపేట: గ్రామ రెవెన్యూ అధికారులందరికీ గ్రేడులను తొలగించడంతో పాటు డీడీఓగా తహసీల్దారే ఉండాలని అంబాజీపేట గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం కోరింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ జె.వెంకటేశ్వరికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. సంఘ నాయకులు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారులకు పంచాయతీ కార్యదర్శులు డీడీఓగా వ్యవహరించడం వల్ల నిర్దేశించిన పనుల విషయంలో వివాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వీఆర్వోల మండల అధ్యక్షుడు గిడ్డి రమణ, ప్రధాన కార్యదర్శి జి.నాగలక్ష్మి, గౌరవ అధ్యక్షుడు వి.రామకృష్ణ, ఐవీవీ.రమేష్, కె.వరప్రసాద్, పీవీ రమణ, సీత పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అయినవిల్లి: ఎస్.మూలపాలెం గ్రామానికి ఓ రైతు అమలాపురంలోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనికి సంబంధించి హెడ్ కానిస్టేబుల్ కె.గణేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎస్.మూలపాలెం గ్రామానికి చెందిన రమణాతి బాల వెంకట్రావు (47) తన సొంత పొలంలో పురుగుమందు పిచికారీ చేసుకుంటున్నాడు. అయితే మంగళవారం తన వరిచేలో సొమ్మసిల్లి పడిపోయాడు. బంధువులు అతన్ని అమలాపురంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనిపై మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ముక్తేశ్వరం అగ్రహారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగలక్ష్మమ్మ

అయినవిల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాటు చేసిన ఎన్నికల బూత్‌లను స్థానిక తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ బుధవారం పరిశీలించిన మండలంలోని ఇప్పటి వరకూ 2008 మంది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు నమోదు చేయించుకున్నట్లు తెలిపారు. ఇంకా ఫైనల్ ఓటర్ల లిస్టు రావాల్సి ఉందన్నారు. మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఒకటి, తొత్తరమూడిలోని ముక్తేశ్వరం అగ్రహారం వద్ద ప్రాథమిక పాఠశాల వద్ద రెండు మొత్తం మూడు బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఎన్నికల ప్రశాంతంగా జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె అన్నారు.